సాక్షి
కర్నూలు
బుధవారం । 2 । ఆగస్టు । 2023



పరివార దేవుళ్లకు పూజలు
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్ర పాలకుడు బయలువీరభద్ర స్వామికి మంగళవారం పూజలు నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం
శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన జి.నరసింహారావు రూ.100,116 విరాళంగా అందజేశారు.



మల్లన్న దర్శనానికి స్మార్ట్ సేవలు
శ్రీశైల దేవస్థానం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని భక్తులకు స్మార్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆలయ సేవలు మరింత సులభతరమయ్యేలా యాప్‌ను ప్రారంభించింది. 8లో..

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా రామసుబ్బారెడ్డి



కర్నూలు(టౌన్): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా పి.రామసుబ్బారెడ్డి(ఎంఎల్‌సీ) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 12 మండలాల్లో వర్షపాతం నమోదైంది. నందవరంలో 13.2 మి.మీ., ఓర్వకల్‌లో 8.4, గూడూరులో 7.2, ఎమ్మిగనూరులో 5.8, సీ.బెళగల్‌లో 5.0, కల్లూరులో 4.2 మిమీ ప్రకారం వర్షాలు కురిశాయి. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ కాగా మొదటి రోజు సగటున 2.1 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా రానున్న ఐదు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

ముమ్మరంగా వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ



లక్ష్మీపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ శివలీల, అదనపు పీడీ షరీఫ్

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే మొదలైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వలంటీర్లు పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించడం విశేషం. పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల, డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్ పర్యవేక్షించారు. కర్నూలు జిల్లాలో 2,36,089 పింఛన్లు ఉండగా మొదటి రోజు 1,11,451 మందికి పింఛను పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,13,642 పింఛన్లు ఉండగా 1,29,435 పింఛన్ల పంపిణీ పూర్తయింది. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగనుండగా.. మొత్తం 16 రకాల పింఛన్లను వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందించారు. వానొచ్చినా, సెలవు వచ్చినా 1వ తేదీనే ఠంచన్‌గా పింఛను అందిస్తుండటం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన విద్యార్థులకు నేషనల్ ఫెలోషిప్

కర్నూలు(అర్బన్): భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు నేషనల్ ఫెలోషిప్, స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ ఎంఫిల్ చేస్తున్న గిరిజన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీలోగా https://fellowship.trible.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారం కోసం కూడా ఇదే వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కుటుంబానికి పెద్ద దిక్కై..
దేశ సేవలో అమరుడై!



వీర మరణం పొందిన శిరిగిరి సురేంద్ర (ఫైల్)

- జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులతో ఎదురుకాల్పులు
- కృష్ణానగర్‌కు చెందిన జవాన్ వీర మరణం
- అర్ధరాత్రి గ్రామానికి చేరుకున్న మృతదేహం
- అధికారిక లాంఛనాలతో నేడు అంత్యక్రియలు

ఆ తల్లి కలలు చెదిరిపోయాయి. ఆ తండ్రి ఆశలు ఆవిరయ్యాయి. తమ కుమారుడు సైన్యంలో చేరి దేశానికి సేవ చేస్తున్నాడని గర్విస్తున్న తల్లిదండ్రులకు ఆనందం అంతలోనే ఆవిరైంది. మరో రెండు నెలల్లో సెలవులకు వస్తానని చెప్పిన రెండు రోజులకే విగతజీవిగా ఇంటికి చేరుకోవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. దేశ సరిహద్దులో ఉగ్రవాదుల దాడిలో నంద్యాల జిల్లా పాములపాడు మండలం కృష్ణానగర్‌కు చెందిన జవాన్ శిరిగిరి సురేంద్ర వీర మరణం పొందారు. నిన్న మొన్నటి వరకు కళ్లెదుట తిరగాడిన యువకుడు ఇక లేడనే చేదు నిజాన్ని ఆ గ్రామం జీర్ణించుకోలేకపోతుంది.

– పాములపాడు



తండ్రి సుబ్బయ్యతో.. (ఫైల్)



సురేంద్ర ఇంటి వద్ద విషాదఛాయలు



జవాన్ కుటుంబీకులను పరామర్శిస్తున్న అధికారులు

దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో సురేంద్ర (ఆర్మీ నెం:15631599కె) నాలుగేళ్ల క్రితం సైన్యంలో చేరారు. ప్రస్తుతం బారాముల్లా ఆర్‌ఆర్ బెటాలియన్ యూనిట్ నెంబర్ 46లో విధులు నిర్వహిస్తూ జూలై 31వ తేదీ మధ్యాహ్నం జరిగిన మిలిటెంట్ ఆపరేషన్‌లో వీర మరణం పొందారు. సురేంద్ర సొంతూరు పాములపాడు మండలం మద్దూరు గ్రామ పంచాయతీలోని మజరా కృష్ణానగర్ గ్రామం. గ్రామానికి చెందిన సుబ్బయ్య, సుబ్బమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. కుమార్తెకు వివాహమైంది. ఎకరా పొలం సాగు చేసుకుంటూ ఇద్దరు కుమారులను బాగా చదివించారు. పెద్ద కుమారుడు సుమన్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉండగా, చిన్న కుమారుడు సురేంద్ర 2019లో ఆర్మీలో చేరారు. నాలుగు నెలల క్రితం సెలవుపై గ్రామానికి వచ్చి రెండు నెలలు కుటుంబీకులతో ఆనందంగా గడిపాడు. తిరిగి వెళ్లిన రెండు నెలలకే ఈ విషాద ఘటన చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సురేంద్ర మృతితో విషాదం నెలకొంది. ఘటనా స్థలం నుంచి మృతదేహాన్ని సోమవారం సాయంత్రం శ్రీనగర్‌కు చేర్చారు. అక్కడి నుంచి మంగళవారం ఉదయం శంషాబాద్‌కు విమానంలో తీసుకొచ్చారు. ఎయిర్‌పోర్టు నుంచి వాహనంలో అర్ధరాత్రి కృష్ణానగర్‌కు తరలించారు. విగతజీవిగా తిరిగి వచ్చిన కుమారుడిని చూసి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. బుధవారం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసనాయుడు గ్రామానికి చేరుకుని జవాన్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేపట్టారు.

నాన్నకు డబ్బులు పంపి.. అన్నకు మెసేజ్ చేసి..

ఉగ్రవాదుల కాల్పుల్లో వీర మరణం పొందిన సురేంద్ర తరచూ కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఇక్కడి వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ అక్కడి విషయాలు పంచుకునేవారు. తల్లిదండ్రులతో వీడియో కాల్ చేసి మాట్లాడుతుండేవారు. ఈ విషాద ఘటనకు ముందు రోజు ఆదివారం తల్లి సుబ్బమ్మకు ఫోన్ చేసి సెలవులు మంజూరయ్యాయని, సెప్టెంబర్ నెలాఖరులో ఇంటికొస్తానని ఆనందంగా చెప్పారు. అలాగే మరణానికి కొన్ని గంటల ముందు సోమవారం ఉదయం 9.30 గంటలకు తండ్రి సుబ్బయ్య బ్యాంక్ ఖాతాలో కొంత డబ్బు జమ చేశాడు. ఆ విషయాన్ని తన సోదరుడు సుమన్ సెల్‌కు మెసేజ్ ద్వారా తెలిపారు. ఆ తర్వాత మూడు గంటల్లోనే మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో సుబ్బయ్యకు ఆర్మీ అధికారులు ఫోన్ చేసి కుమారుడి మరణం గురించి తెలపడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జవాన్ సురేంద్ర 1 నుంచి 7వ తరగతి వరకు కృష్ణానగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో, 8 నుంచి 10వ తరగతి వరకు పాములపాడు జెడ్పీ స్కూల్‌లో చదివారు. ఇంటర్మీడియెట్ ఆత్మకూరు పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో, డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్స్ వెలుగోడులో పూర్తి చేశాడు. చిన్నప్పటి నుంచి ఆటల్లో చురుకుగా ఉండే సురేంద్ర 2019 మార్చి 31న ఆర్మీలో చేరారు. కాగా సరిగ్గా నాలుగేళ్ల తర్వాత అదే 31వ తేదీన వీర మరణం పొందడం విషాదం.

మాజీ సైనికుల సంక్షేమ సంఘం సంతాపం

కర్నూలు(అర్బన్): వీర జవాన్ సురేంద్ర మృతి పట్ల జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య, కార్యదర్శి ఎం సుధాకర్, కోశాధికారి నజీర్‌అహమ్మద్ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బుధవారం కృష్ణానగర్‌లో జరిగే అంత్యక్రియలకు జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఆర్ రత్నరూత్, ఎన్‌సీసీ గ్రూప్ నుంచి సుబేదార్ రవీంద్రసింగ్‌తో పాటు తాము కూడా హాజరవుతున్నట్లు తెలిపారు.

'సీమ' జోన్ ఎక్సైజ్ డీసీగా శ్రీలత

కర్నూలు : రాయలసీమ జోన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీలత నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈమె రాయలసీమ జోన్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (అనంతపురం) డీసీగా పని చేస్తున్నారు. కర్నూలులో మూడేళ్లుగా ఇన్‌చార్జి డీసీగా ఉన్న మునుస్వామిని సెబ్‌కు అలాట్ చేసి శ్రీలతను ఎక్సైజ్ డీసీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2007లో ఏఈఎస్ హోదాలో ఎక్సైజ్ శాఖలో చేరిన ఈమె అంచెలంచెలుగా డిప్యూటీ కమిషనర్ హోదాకు ఎదిగారు. గతంలో ఈమె కర్నూలు ఎక్సైజ్ డిపో మేనేజర్‌గా, సెబ్‌లో కర్నూలు అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. మద్యం, సారా, ఇసుక అక్రమ రవాణా అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2020 మేలో సెబ్‌ను ఏర్పాటు చేసింది. కొన్నేళ్లుగా ఎక్సైజ్ శాఖలో ఉన్న అధికారులు, సిబ్బందిలో 75 శాతం మందిని ప్రభుత్వం అప్పట్లో సెబ్‌కు కేటాయించింది. అయితే సెబ్ విభాగం ఏర్పాటై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సెబ్ నుంచి ఎక్సైజ్‌కు, అక్కడినుంచి సెబ్‌కు మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా ఎక్సైజ్ శాఖలో ప్రస్తుతం కర్నూలు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నాగేశ్వరరావు, ఐఎంఎల్ డిపోలో పనిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ రాముడు కూడా సెబ్ విభాగానికి అలాట్ అయ్యారు. అయితే వీరికి పోస్టింగులు కేటాయించాల్సి ఉంది.

ఆంధ్ర సరిహద్దుకు ఎల్లెల్సీ నీరు

హొళగుంద: జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల వరప్రదాయిని అయిన తుంగభద్ర నీరు మంగళవారం రాత్రి ఆంధ్రలోని దిగువ కాలువ(ఎల్లెల్సీ) దగ్గరకు చేరుకున్నాయి. గత నెల 28న ఎల్లెల్సీకి నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ నీరు మంగళవారం తెల్లవారు జామున హొళగుంద సెక్షన్ 184 కి.మీ.కు చేరుకోగ ఎస్డీఓ, సెక్షన్ ఆఫీసర్లు ప్రసన్నకుమార్, గోపిచంద్, శ్రీకాంత్, విజయ్‌కుమార్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులతో పాటు సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం సాయంత్రంలోపు బోర్డు సరిహద్దు 250 కి.మీ హన్వాళ్ సెక్షన్‌ను దాటి ఆంధ్రలోకి ప్రవేశిస్తాయి. కాలువలో గంటకు 100 క్యూసెక్కుల మేర నీటి పరిమాణం పెరుగుతూ గంటకు రెండు కి.మీ. మేర ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా మంగళవారం తుంగభద్ర రిజర్వాయర్‌లోకి 29,335 క్యూసెక్కుల నీరు రావడంతో నీటి నిల్వ 1,626 (పూర్తిమట్టం 1633 అడుగులు) అడుగులకు చేరింది.

'జగనన్న సురక్ష'తో 4.38 లక్షల మందికి లబ్ధి

- సేవల్లో రాష్ట్రంలో కర్నూలు జిల్లాకు 10వ స్థానం
- 1.98 లక్షల ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు జారీ
- 1.89 లక్షల ఇన్‌కమ్ సర్టిఫికెట్ల అందజేత
- విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు కల్చరల్: జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని, ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో 4,38,208 మందికి ఉచితంగా సర్వీసులు అందించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు 25 మండలాలు, 4 మున్సిపాలిటీల పరిధిలోని 672 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత దగ్గర చేసేలా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి ముందుగానే వెళ్లి వారికి కావాల్సిన సర్వీసులు ఏవైనా ఉన్నాయా అని తెలుసుకొని సుమోటోగా వలంటీర్ ద్వారా అప్లికేషన్ పెట్టించామన్నారు. వారం రోజుల తర్వాత ఆ సచివాలయంలోనే క్యాంప్ ఏర్పాటు చేసి ప్రజలకు నేరుగా సర్టిఫికెట్లు అందించామన్నారు. జేఎస్పీ ద్వారా 1,98,520 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 1,89,580 ఇన్‌కమ్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ఆర్‌ఓఆర్ 1(బి) సర్టిఫికెట్లు 9,789, ఆధార్ కార్డులో నెంబర్ అప్‌డేట్ 4,442, కంప్యూటరైజేషన్ ఆఫ్ అడంగల్ 4,262, కొత్త రేషన్ కార్డులు 717తో పాటు ఇతర సర్వీసులు 4,38,208 అందించామన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, మ్యూటేషన్ లాంటి సేవలు వారం రోజుల్లో ఇవ్వలేమని వాటికి సంబంధించిన దరఖాస్తులను తీసుకొని నిర్దిష్ట గడువులోగా అర్జీదారులకు అందజేస్తామన్నారు. జేఎస్పీ ద్వారా పభుత్వ సేవలు అందించడంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా 10వ స్థానంలో ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: జిల్లాలోని పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు సోమవారం నుంచి ఎఫ్‌ఏ-1 పరీక్షలు ప్రారంభించారు. 2023-24 విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీన ప్రారంభమైంది. అకడమిక్ ప్లానింగ్ ప్రకారం జూన్, జూలై నెలల్లో విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్‌ను పూర్తి చేసి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకుని సరిదిద్దేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 1 నుంచి 8వ తరగతులకు చెందిన విద్యార్థులకు క్లాస్‌రూం బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో, 9,10 తరగతులకు చెందిన విద్యార్థులకు మధ్యాహ్నం ఫార్మాటివ్ అసెస్‌మెంట్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 5 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. తర్వాత పరీక్ష ఫలితాల ఆధారంగా అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సామర్థ్యాలను పెంచేందుకు పరీక్షల విభాగం చర్యలు తీసుకుంటుంది.

రెండు భాషల్లో ప్రశ్నపత్రాలు

ప్రస్తుతం ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల విద్యను అందిస్తున్నారు. అయితే, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తెలుగు, ఇంగ్లిష్ విధానంలో పాఠ్యపుస్తకాలను అందించి టీచర్లతో రెండు భాషల్లో బోధన చేయిస్తున్నారు. ప్రస్తుతం ఎఫ్‌ఏ ప్రశ్నపత్రాలను సైతం రెండు భాషల్లో ఇస్తున్నారు. జిల్లాలో 2,239 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 4.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

బాబుకు రాజకీయ సమాధి కడతాం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకుల హెచ్చరిక



బిర్లా సర్కిల్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): రానున్న ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాజకీయ సమాధి కడతామని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఆయా సంఘాల నాయకులు ఎం. సుభాష్ చంద్రబోస్, సీహెచ్ మద్దయ్య, బెల్లం మహేశ్వరరెడ్డి, దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య ఆధ్వర్యంలో బిర్లాసర్కిల్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. మైనారిటీల ద్రోహి చంద్రబాబు, రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను తీవ్రంగా అవమానించి చిన్న చూపు చూశారని ఆరోపించారు. అనేక పర్యాయాలు ఆయన బడుగు, బలహీన వర్గాలను కించపరుస్తు మాట్లాడారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో బడుగు, బలహీన వర్గాలకు స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ఆయా వర్గాలన్నీ రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, శ్రీరాములు, కార్పొరేటర్ జయరామ్, రాజశేఖర్, ఎరుకల రాజు, మూర్తి, నాగేంద్ర, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు అప్పుడు గుర్తుకు రాలేదా బాబు



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడుకు సాగునీటి ప్రాజెక్టులు ఎందుకు గుర్తుకు రాలేదో ప్రజలకు చెప్పాలని మంత్రి గుమ్మనూరు జయరాం డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాలో పుట్టి పెరిగి ఈ ప్రాంతానికి ఆయన చేసిన మేలు శూన్యమన్నారు. మంగళవారం చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎంగా ఉన్నప్పుడు సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోని చంద్రబాబు నేడు ప్రాజెక్టుల గురించి మాట్లాడటం వింతగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. వాటి కింద రైతులు రెండు పంటలు పండించుకుంటూ హాయిగా జీవిస్తున్నారన్నారు. నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ప్రాజెక్టుల సందర్శన చేపడితే ప్రజలు నవ్వుకుంటారన్నారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- 14 ఏళ్లు సాగునీటి ప్రాజెక్టులను విస్మరించిన ఘనుడు
- మహానేత చలువతోనే ప్రాజెక్టులు కళకళ
- అదే తరహాలో ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్
- విలేకరుల సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల
- నేడు ఏ మొహంతో బాబు ప్రాజెక్టుల సందర్శనకు వచ్చారు?
- పార్టీ నంద్యాల, కర్నూలు అధ్యక్షులు కాటసాని, బీవై రామయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, ఆర్థర్, సుధాకర్, గంగుల బిజేంద్రారెడ్డి తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): 'రాయలసీమ ద్రోహి చంద్రబాబు. ఆయన ఈ ప్రాంత అభివృద్ధికి పట్టిన పెద్ద శని' అని రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించారన్నారు. అలాంటి వ్యక్తి నేడు ప్రాజెక్టుల సందర్శనకు రావడం వింతగా ఉందన్నారు. జిల్లాకు వచ్చే ముందు ఈ ప్రాంతానికి చేసిన మేలు ఏమిటో ఆయన ప్రజలకు చెప్పి రావాల్సింది అన్నారు. తమిళనాడుతో ఉన్న ఒప్పందం మేరకు తెలుగు గంగ ప్రాజెక్టును దివంగత ఎన్టీఆర్ తీసుకొస్తే వైఎస్‌ఆర్ ఆ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతులకు మరింత మేలు జరిగేలా చర్యలు తీసుకున్నారన్నారు. ముఖ్యమంత్రిగా రైతాంగానికి సాగునీరు అందించేందుకు మహానేత వైఎస్‌ఆర్ తపించారన్నారు. అదే చంద్రబాబు సీఎంగా ఏ చెరువుకు నీరందించలేదన్నారు. ఆయన హయాంలో కరువు కాటకాలతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందిపడ్డారన్నారు. డోన్, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని 68 చెరువులను నీటితో నింపేందుకు పనులు పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిది అన్నారు. రూ.వేల కోట్లతో వేదవతి, ఆర్‌డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తి చేస్తానని గత ఎన్నికల ముందు జీఓ ఇచ్చిన బాబు ఏం చేశారో చెప్పాలన్నారు. కరోనా విపత్తులోనూ ప్రజలకు తాగు, సాగు నీటికి కష్టాలు లేకుండా చూసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్‌ను దివంగత సీఎం వైఎస్‌ఆర్ ప్రారంభించారన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మోటర్లను పట్టిసీమ కోసం ఎత్తుకెళ్లిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ఒక్కరే ప్రాజెక్టులను సందర్శించడం వల్ల ప్రయోజనం లేదని, తమను ఆహ్వానిస్తే ఆయా ప్రాజెక్టులకు వైఎస్‌ఆర్, సీఎం జగన్ చేసిన కృషిని చెబుతామన్నారు.

బాబును ప్రజలు నమ్మరు

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మాట్లాడుతూ చంద్రబాబు 14ఏళ్ల అధికారంలో ఉండి ఏ ప్రాజెక్టుకు డీపీఆర్ రూపొందించారో ప్రజలకు చెప్పాలన్నారు. వ్యవసాయమే దండగన్న ఆయనకు ప్రాజెక్టులను సందర్శించే అధికారం ఎక్కడిదన్నారు. మహానేత వైఎస్‌ఆర్ జలయజ్ఞం పేరుతో రూ.60వేల కోట్లు వెచ్చించి ప్రాజెక్టులు నిర్మిస్తే.. చంద్రబాబు కనీసం మోటర్లు సైతం ఏర్పాటు చేయలేదన్నారు. అలాంటి వ్యకి నేడు ప్రాజెక్టుల సందర్శనకు వస్తే ప్రజలు నమ్మరన్నారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని ఆర్భాటం చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకెళ్తున్న సీఎం జగన్ ప్రభుత్వంపై 80శాతం మంది ప్రజలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారని చెప్పారు. సొంత నియోజకవర్గం కుప్పంకు నీరివ్వలేని చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన యాత్ర చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 2014-19 కాలంలో రూ.146కోట్లు ఖర్చు చేస్తే, 2019-23 మధ్య తమ ప్రభుత్వం రూ.448.98 కోట్లు ఖర్చు చేసిందన్నారు. దీన్ని బట్టి ఎవరి హయాంలో ప్రాజెక్టుల అభివృద్ధి ఎక్కువ జరిగిందో తెలుస్తుందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్, పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, విజయ పాల డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ శ్వేతారెడ్డి పాల్గొన్నారు.

మభ్యపెట్టేందుకే పర్యటనలు

ప్రజలను మాయమాటలతో మభ్య పెట్టేందుకు రాష్ట్రంలో చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ యాత్రలు, పర్యటనలు చేస్తున్నారు. వీరు ఎన్ని కుట్రలు పన్నినా, మాయమాటలు చెప్పినా జనం నమ్మరు.

– కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

వైఎస్‌ఆర్ కృషి ఎనలేనిది

ముచ్చుమర్రి ప్రాజెక్టు పూర్తికి వైఎస్‌ఆర్ కృషి ఎనలేనిది. సరిగ్గా 5 శాతం పనులు కూడా చేయని చంద్రబాబు ఆ ప్రాజెక్టును సందర్శించడం విడ్డూరం. కాటన్ ఆర్థర్ తరువాత మహానేత వైఎస్‌ఆర్ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతుల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు.

– నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్,

ప్రాజెక్టులకు ఏం చేశారో చెప్పాలి

మహానేత వైఎస్‌ఆర్ జలయజ్ఞం పథకం కింద గాలేరునగరి, ఎస్‌ఆర్‌బీసీని అభివృద్ధి చేస్తే.. చంద్రబాబు ఏం చేశారో చెప్పాలి. చెప్పకుండా ప్రాజెక్టుల సందర్శన చేయడం తగదు. బాబు అధికారంలో ఉంటే వర్షాలు రావని పేరు. అందుకే ఆయనను 2019 ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారు.

–బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ముసలి కన్నీరు కారుస్తున్నారు

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు ముసలి కన్నీరు కారుస్తున్నారు. గతంలో ఆయన ప్రాజెక్టులకు ఏదో చేసినట్లు నటిస్తున్నారు. ఆయన ఎన్ని ఎత్తులు వేసినా అధికారంలోకి రారు.

– ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

బాబు గురించి జనానికి తెలుసు

రైతుల సంక్షేమం కోసం నాడు మహానేత వైఎస్‌ఆర్, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు ఏనాడూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఆయన ఏ లక్ష్యంతో యాత్ర చేస్తున్నారో ప్రజలకు తెలుసు.

–కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

క్లుప్తంగా

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం ఆగస్టు 17న ప్రారంభమవుతుందన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు అభ్యర్థులకు ఉచిత భోజనం, హాస్టల్ వసతితో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ముద్ద చర్మవ్యాధి నివారణకు ముందుస్తు టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రమాదకరమైన ముద్ద చర్మవ్యాధి (లంపిస్కిన్ డిసీజ్) నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ దుర్గాప్రసన్నబాబు తెలిపారు. ఈ వ్యాధి తెల్లజాతి పశువులకే సోకుతుందని.. జిల్లాలో ఈ పశువులు 2,35,586 ఉన్నాయన్నారు. ఇందులో 80 శాతం పశువులకు లంపిస్కిన్ డిసీజ్ నివారణ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. జిల్లాకు మొత్తం 2,01,000 డోసుల గోట్ ఫాక్స్ వ్యాక్సిన్ సరఫరా చేయగా.. కర్నూలు డివిజన్‌కు 1.08 లక్షల డోసులు, ఆదోని డివిజన్‌కు 93 వేల డోసులు కేటాయించామన్నారు. ఈ వ్యాక్సిన్ ముందస్తుగా వేయడం వల్ల పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ నెల 2 నుంచి టీకాలు వేయడాన్ని వేగవంతం చేయాలని వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, ఏడీలను కోరారు.

లోయలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

- చేతిపై ఆంజనేయ స్వామి పచ్చబొట్టు



శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని నంద్యాల–గిద్దలూరు ఘాటు రోడ్డులో బొగద వద్ద పాత రైల్వే ట్రాక్ గరండాలు మోత్క మాను వద్ద లోయలో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్, పోలీసులు సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి, తెల్లని ఫుల్ చొక్కా, ఆకు పచ్చ లుంగీ ధరించాడని, కుడి చేతికి ఆంజనేయ స్వామి పచ్చ బొట్టు ఉందని ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121101170, 9121101169ను సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

మల్లన్న దర్శనానికి 'స్మార్ట్' సేవలు

- అందుబాటులోకి 'శ్రీశైల దేవస్థానం' మొబైల్ యాప్
- వసతి, దర్శనం, ఆర్జిత సేవల టికెట్ల బుకింగ్ మరింత సులువు
- మొబైల్ యాప్‌తో మరిన్నీ సేవలు అందుబాటులోకి

శ్రీశైలంటెంపుల్: దేశంలోని శైవక్షేత్రాల్లో ఎంతో ఖ్యాతి చెందిన శ్రీశైల దేవస్థానం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని భక్తులకు స్మార్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. స్వామి అమ్మవార్ల దర్శనం, ఆలయ సేవలు, వసతి సౌకర్యాలు పొందడం మరింత సులభతరమైంది. ఈ మేరకు డివోటీ యాప్‌ను ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా ఆర్జితసేవలు, వసతి, దర్శనం సౌకర్యాలతో పాటు శ్రీశైలక్షేత్ర చరిత్ర, క్షేత్ర ప్రాశస్త్యం తదితర విషయాలు భక్తులు తెలుసుకునేలా రూపొందించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి చేతుల మీదుగా ఈ యాప్‌ను ప్రారంభించింది. భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రద్దీ రోజుల్లో భక్తులు దర్శన,వసతికి ఇ బ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కొందరు దళారులను నమ్మి మోసపోయిన సంఘటనలు కూ డా ఉన్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టి, ఉభయ దేవాలయాల్లో జరిగే అన్ని ఆర్జితసేవా టికెట్లను భక్తులే నేరుగా బుకింగ్ చేసుకునేలా అవకాశం కల్పించింది. ఇప్పటికే మే నెల నుంచి



శ్రీశైల ఆలయం

ఉభయ దేవాలయాల్లో నిర్వహించే అన్ని ఆర్జితసేవలు, స్వామివారి స్పర్శదర్శనం(వీఐపీ బ్రేక్ దర్శనం), వసతి గదులు పొందేలా ఆన్‌లైన్ సేవలు ప్రారంభించింది. శ్రీశైల దేవస్థాన అధికారిక వెబ్‌సైట్ www.srisailadevasthanam. org ద్వారా భక్తులు ఆయా సేవా టికెట్లను నేరుగా పొందే అవకాశం కల్పించింది. ఈ సేవలు మరింత సులభతరం చేసేలా శ్రీశైల దేవస్థానం పేరుతో 'డివోటీ కనెక్ట్' అనే మొబైల్ యాప్‌ను రూపొందించింది.



గూగుల్ ప్లేస్టోర్ నందు శ్రీశైల దేవస్థానం యాప్

ప్రస్తుతం ఈ యాప్ సెక్యూరిటీ ఆడిట్ పూర్తి చేసుకుని గూగుల్ ప్లే స్టోర్‌లో భక్తులకు అందుబాటులోకి వచ్చింది. భక్తులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సేవలు పొందవచ్చు.

యాప్‌తో సులభంగా సేవలు:

- శ్రీశైల దేవస్థానం రూపొందించిన శ్రీశైల దేవస్థానం డివోటీ కనెక్ట్ యాప్ ద్వారా భక్తులు ఉభయ దేవాలయాల్లో జరిగే ఆర్జిత సేవలు, స్వామివారి స్పర్శ దర్శనం, వసతి సౌకర్యం, పరోక్షసేవలు, ఈ–హుండీ, విరాళాల చెల్లింపులు చేసుకోవచ్చు.
- భక్తులు తమ మొబైల్ నుంచి డిజిటల్ ట్రాన్సాక్షన్స్ చేసుకుని అన్ని సేవలు పొందవచ్చు.
- సేవలతో పాటు, ప్రత్యేక కార్యక్రమాల వివరాలు, దేవస్థాన ఇతర వివరాలు నోటిఫికేషన్ రూపంలో పొందవచ్చు.



- ఈ యాప్ ద్వారా సేవలతో పాటు క్షేత్ర ధార్మిక సమాచారాన్ని కూడా పొందవచ్చు.
- వివిధ దేశాలలో, ప్రాంతాల్లో ఉన్న భక్తులకు స్వామిఅమ్మవార్ల ఆశీస్సులు పొందేలా, దేవస్థానం పూర్తి సమాచారం, దేవస్థానం పురాణం, చరిత్ర, ప్రస్తుత స్థితిగతులు తదితర పూర్తి సమాచారం మొబైల్ యాప్‌లో తెలుసుకోవచ్చు.
- క్షేత్రంలో జరిగే నిత్యపూజాది కార్యక్రమాలు, ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీశైల టీవీ లైవ్ స్ట్రీమింగ్ ద్వారా వీక్షించవచ్చు.
- ఈ యోబైల్ యాప్‌ను మన దేశంలోనే కాకుండా, ఇతర దేశాల్లో ఉన్న స్వామిఅమ్మవార్ల భక్తులు లాగిన్ చేసుకుని, వారికి కావాల్సిన అధ్యాత్మిక సమాచారాన్ని వారు ఉన్న ప్రదేశం నుంచి పొంది దైవత్వంలోని అనుభూతిని పొందవచ్చు.

భక్తులకు మెరుగైన సేవలు



ఆలయంలో నిర్వహిస్తున్న అన్ని ఆర్జిత సేవలు, శ్రీస్వామివారి స్పర్శదర్శనం టిక్కెట్లను భక్తులు సులభంగా పొందేందుకు వీలుగా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం. టిక్కెట్ల జారీలో పారదర్శకత, జవాబుదారి తనాన్ని పెంపొదించేందుకు ఈ విధానం ఎంతగానో తోడ్పడుతోంది. భక్తులు ఉచితంగా స్వామిఅమ్మవార్లను దర్శించుకునే సర్వదర్శనాన్ని యథావిధిగా వేకువజామున 4.30 గంటలకు ప్రారంభిస్తున్నాం. వారములో నాలుగు రోజులు పాటు (మంగళ, బుధ, గురు, శుక్ర, వారాలు) మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభించి, ఉచిత స్పర్శదర్శనాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నాం. కాగా ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లను పొందేవారు భక్తులు టిక్కెట్ల లభ్యతను బట్టి ఒక గంట ముందు వరకు టిక్కెట్లను పొందవచ్చు.

– ఎస్. లవన్న, కార్యనిర్వాహణాధికారి, శ్రీశైల దేవస్థానం

డౌన్‌లోడ్ ఇలా..

శ్రీశైల దేవస్థానం యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో 'శ్రీశైల దేవస్థానం యాప్' అని టైప్ చేస్తే యాప్ వస్తుంది. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న తరువాత భక్తులు తమ ఈమెయిల్ ఐడీతో లాగిన్ అవ్వాలి. అటు తరువాత యాప్ ద్వారా భక్తులకు కావాల్సిన సమాచారాన్ని, దర్శనం టికెట్లను పొందవచ్చు.

పెయ్యదూడల అభివృద్ధితో పాడిలో రాణింపు

- జిల్లా పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ అధికారి దుర్గాప్రసన్నబాబు

కర్నూలు(అగ్రికల్చర్): లింగనిర్ధారిత వీర్యం ద్వారా పెయ్య దూడలను అభివృద్ధి చేసుకుంటే పాడిలో రాణించవచ్చని జిల్లా పశు సంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ దుర్గాప్రసన్నబాబు తెలిపారు. కర్నూలు శివారులోని నందనపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా పుట్టిన పెయ్యదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. 26 మంది రైతులకు చెందిన 46 దూడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా దూడలకు నట్టల నివారణ మందులు తాపి కాల్షియం టానిక్‌లు పంపిణీ చేశారు. ప్రదర్శనలో పాల్గొన్న దూడల యజమానులకు బహుమతుల ప్రదానం చేశారు. 20 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాడి అభివృద్ధికి కృత్రిమ గర్భధారణ ఎంతో తోడ్పడుతుందని తెలిపారు.



లేగదూడల ప్రదర్శన

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. దూడలు పుట్టిన తర్వాత నట్టల నివారణ మందులు తాపితే అవి ఆరోగ్యంగా పెరుగుతాయని తెలిపారు. నేటి పెయ్య దూడలే రేపటి పాడిపశువులని, వీటిపంపకంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కోడుమూరు ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీ రామసుబ్బారెడ్డి, స్థానిక వెటర్నరీ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కీం పేరుతో టోకరా

ఆదోనిఅర్బన్: పట్టణంలో చీరల వ్యాపారం చేసే ఓ మహిళ స్కీం పేరుతో మోసం చేశారు. ఏకంగా రూ. 52 లక్షలతో ఉడాయించారు. బాధితులు డీఎస్పీ శివనారాయణస్వామిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై త్రీటౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కార్వన్‌పేటలో లక్ష్మీబాయి, నర్సింగ్ దంపతులు నివాసముంటున్నారు. వీరికి కుమారుడు రాహుల్, కుమార్తె సోనీ సంతానం. ఈ దంపతులు పట్టణంలోని పెద్దమార్కెట్‌లో లక్ష్మీటెక్స్‌టైల్స్ పేరుతో చీరల దుకాణం నిర్వహిస్తున్నారు. లక్ష్మీబాయి ఇంటి వద్ద చీరలు అమ్ముతూ స్కీం వేశానని స్థానిక మహిళలను నమ్మించింది. 18 నెలలపాటు నెలకు రూ.2,500 చొప్పున కడితే 20వ నెలలో రెండు నెలల బోనస్‌తో పాటు రూ.50 వేలు ఇస్తానని చెప్పింది. పలువురు నమ్మి డబ్బు కట్టారు. జూలై నెలాఖరులో వారికి తిరిగి చెల్లించాల్సి ఉండటంతో దుకాణంలోని సరుకు, ఇంట్లోని సామాన్లు తీసుకుని పరారయ్యారు. ఈమేరకు కురిసేట్‌బీతో పాటు మరో 19 మంది బాధితులు తమను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అమ్మ పాలు అమృతం

నంద్యాలటౌన్: అమ్మ పాలు అమృతంతో సమానమని, బిడ్డకు తల్లి పాలను మించిన ఆహారం మరొకటి లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆయన తల్లి పాల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల వయసు వచ్చే వరకు పిల్లలకు తల్లి పాలు మాత్రమే అందించాలన్నారు. బిడ్డకు తల్లి పాల వల్ల కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చంద్రబాబుకు ప్రాజెక్టులపై మాట్లాడే అర్హతే లేదు

- వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి



నంద్యాల: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హతే లేదని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏమి చేయని చంద్రబాబు నేడు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రైతులను మభ్యపెట్టడానికే సాగునీటి ప్రాజెక్టుల సందర్శన పేరుతో కొత్త డ్రామాకు తెర తీశారన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమకు ప్రాణాధారమైన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 44 వేల క్యూసెక్కులకు పెంచాలని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి ఉద్యమం చేస్తే టీడీపీ నాయకులు వ్యతిరేకించడం వాస్తవం కాదా అని గుర్తు చేశారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, శ్రీశైలం కుడి ప్రధాన కాలువ సామర్థ్యం పెంపు, గోరుకల్లు, అవుకు, గండికోట, మైలవరం, సర్వారాయ సాగర్ రిజర్వాయర్ల నిర్మాణం, మల్యాల, ముచ్చుమర్రి, హైడిపాలెం ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టిన వైఎస్సార్ అపరభగీరథుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే చంద్రబాబుకు ప్రజలు, రైతులపై కపటప్రేమ పుట్టుకొస్తుందన్నారు. ప్రజలు చంద్రబాబు గిమ్మిక్కులను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. చంద్రబాబు సొంతంగా ప్రారంభించి పూర్తి చేసిన పథకం ఒక్కటైనా చెప్పే పరిస్థితిలో నేడు లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుందూనది విస్తర్ణ, రాజోలి, జోళదరాశి రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి పనులు సైతం ప్రారంభించారన్నారు. రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులతో మోసపోకుండా గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి ఆసరాగా నిలుస్తున్నారన్నారు.

ఏసీబీ డీఎస్పీగా వెంకటాద్రి



కర్నూలు : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కర్నూలు డీఎస్పీగా వెంకటాద్రి నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటాద్రి మే 15వ తేదీ నుంచి విజయవాడ చీఫ్ ఆఫీస్‌లో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. కర్నూలు డీఎస్పీగా ఉన్న శివనారాయణస్వామి ఈ ఏడాది మేలో ఆదోని డీఎస్పీగా బదిలీ కావడంతో ఏసీబీ డీఎస్పీ పోస్టు ఖాళీ ఏర్పడింది. తిరుపతి జిల్లా పాకాలకు చెందిన వెంకటాద్రి 1991లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. ఈయన సీఐగా 2002లో పదోన్నతి పొంది జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. అలాగే 2013లో డీఎస్పీగా పదోన్నతి పొంది ఎస్‌ఐఏ హైదరాబాద్‌లో, ఆ తర్వాత కర్నూలు మహిళా పీఎస్‌లో, నెల్లూరు జిల్లా ఆత్మకూరులో డీఎస్పీగా విధులు నిర్వహించారు. 2019 జూన్ నుంచి ఈ ఏడాది మే 15 వరకు కర్నూలు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పనిచేశారు. ప్రస్తుతం చీఫ్ ఆఫీస్‌లో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఈయనను కర్నూలు ఏసీబీ విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి

వేరుశనగకు గిట్టుబాటు ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు బావులు, బోర్ల కింద పండించిన వేరుశనగ మార్కెట్‌కు వస్తోంది. మంగళవారం 182 క్వింటాళ్ల వేరుశనగ మార్కెట్‌కు రాగా వ్యాపారులు ఈ–నామ్ ద్వారా కొనుగోలు చేశారు. వేరుశనగలో నాణ్యత బాగుండటంతో గరిష్టంగా క్వింటాకు రూ.8,409 ధర లభించింది. కనిష్ట ధర రూ.5,071, మోడల్ ధర రూ.6,832 వచ్చింది. కర్నూలు మార్కెట్‌తో పాటు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లోనూ వేరుశనగకు గిట్టుబాటు ధర లభిస్తుండటం రైతులకు ఊరటనిస్తోంది.

గత ప్రభుత్వ స్వార్థమే..

- నాణ్యత లోపంతో కోసిగిలో పెచ్చులూడిన పైకప్పు
- ఇద్దరు పిల్లలకు స్వల్పగాయాలు



పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో జేబీఎం ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడిన ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ఘటనకు గత టీడీపీ ప్రభుత్వ నిర్వాకమే కారణంగా తెలుస్తోంది. నాడు నాసిరకంగా పాఠశాల తరగతి గదులను నిర్మించడంతో పైకప్పు పెచ్చులూడిపడినట్లు ఎంపీపీ ఈరన్న, స్థానికులు నాడుగేని నాగరాజు, మంగమ్మ, మాణిక్యరాజు, జగదీష్‌స్వామి చెబుతున్నారు. కాగా మంగళవారం సర్వశిక్ష అభియాన్ ఈఈ కర్రెన్న, ఎంఈఓ–1 మొయినుద్దీన్, ఎస్‌ఐ సతీష్‌కుమార్ జేబీఎం పాఠశాలను సందర్శించారు. అనంతరం ఎస్‌ఎస్‌ఏ ఈఈ మాట్లాడుతూ 2014–2015 విద్యా సంవత్సరంలో సర్వశిక్ష అభియాన్ కింద రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.13లక్షలు నిధులు కేటాయించారు. అయితే, పైకప్పు అడుగు భాగంలో వేసిన ప్లాస్టింగ్ నాసిరకంగా ఉండటంతో పెచ్చులూడి పోయిందన్నారు. అయితే, ఆ సమయంలో విద్యార్థులు దూరంగా కూర్చొవడంతో ప్రమాదం తప్పిందన్నారు.

బంగారం చోరీ కేసు ఛేదింపు

ఆదోని అర్బన్: పట్టణంలోని షరాఫ్‌బజార్‌లోని ముఖేష్ జ్యూవెలరీ షాపులో జూలై 27వ తేదీన జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ విక్రమసింహాతో కలిసి డీఎస్పీ శివనారాయణస్వామి విలేకరులకు వివరాలు వెల్లడించారు. వెస్ట్ గోదావరి జిల్లా ఆకివీడు మండలం ఐ.భీమవరం గ్రామానికి చెందిన గొర్ల సత్యనారాయణ అనే వ్యక్తి పేకాటకు బానిసై దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో గత నెల 27వ తేదీన ఆదోనిలో ముఖేష్ జ్యూవెలరీ షాపునకు కస్టమర్‌గా వెళ్లి వెండి ఉంగరం కావాలని అడిగాడు. ఆ సమయంలో దుకాణంలో యజమాని సోనీ ముఖేష్ లేరు. ఆయన తమ్ముడు పంకజ్ ఒక్కడే ఉన్నాడు. సత్యనారాయణ అడిగిన వెండి ఉంగరం కోసం పంకజ్ పక్క దుకాణంలోకి వెళ్లి తిరిగి వచ్చే లోపు రూ.4.50 లక్షలు విలువైన 30 జతల బంగారు కమ్మల బాక్సును తీసుకుని పరారయ్యాడు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. గత నెల 30న నిందితుడు కర్ణాటక రాష్ట్రం రాయచూరులోని బైపాస్ రోడ్డు వద్ద ఉండగా పట్టుకొని 17 జతల బంగారు కమ్మలను స్వాధీనం చేసుకున్నారు. మిగతా 13 జతల కమ్మలు హైదరాబాద్ మణప్పురం గోల్డ్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్లు వెలుగులోకి వచ్చిందని డీఎస్పీ తెలిపారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

డిపార్టుమెంటల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): నేటి నుంచి ఈనెల 7వ తేదీ వరకు జరిగే డిపార్టుమెంటల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు డీఆర్వో కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డిపార్టుమెంటల్ పరీక్షలకు సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయా పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎల్రక్టానిక్ పరికరాలను అనుమతించొద్దని సూచించారు.

యూఎన్‌ఓలో ప్రసంగానికి నేడు ఎంపిక

- ఆదోని మున్సిపల్ హైస్కూల్‌లో వెబెక్స్ ద్వారా పరీక్ష



డి అభయ్ చరణ్,శివ లింగమ్మ

కర్నూలు సిటీ: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అమెరికాలో పర్యటించే అరుదైన అవకాశం దక్కనుంది. ఇందుకు ప్రస్తుతం విద్యార్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి రాత పరీక్ష నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపిన 20 మందిని ఎంపిక చేశారు. వీరికి నేడు(బుధవారం) స్పీకింగ్ టెస్ట్‌ను వెబెక్స్ ద్వారా నిర్వహించనున్నారు. స్పీకింగ్ పరీక్షకు ఎంపికైన వారిలో జిల్లా నుంచి ఆదోని డివిజన్ పరిధిలోని సంతకొడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన డి.అభయ్ చరణ్ (ప్రస్తుతం ట్రిపుల్‌ఐటీ నూజివీడులో అడ్మిషన్ పొందారు), ఆదోని కస్తూరిబా గాంధీ విద్యాలయ(మైనార్టీ)లో 10వ తరగతి చదివిన ఎం.శివ లింగమ్మ (ప్రస్తుతం ఆరెకల్లు రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో చేరారు) ఉన్నారు. వీరు నేడు ఆదోని మున్సిపల్ హైస్కూల్‌లో వెబెక్స్ ద్వారా జరిగే పరీక్షలో పాల్గొననున్నారు. ఇందులో ఎంపికైన వారికి అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ అధికార నివాసం వైట్‌హౌస్‌ను సందర్శించే అవకాశం దక్కనుంది. అదే సమయంలో కొలంబియా వర్సిటీలో నిర్వహించనున్న సదస్సులో ఇతర దేశాలకు చెందిన విద్యార్థులతో కలిసి ప్రసంగిస్తారు. దీంతో పాటు ప్రపంచ బ్యాంకు నిర్వహించే సదస్సులో కూడా మాట్లాడే అవకాశం దక్కుతుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వైట్‌హౌస్ సందర్శన అవకాశాన్ని అమెరికా ప్రభుత్వంలోని బ్యూరో ఆఫ్సౌత్ అండ్ సెంట్రల్ ఆసియా అఫైర్స్ విభాగం కల్పిస్తుంది.

ఇలా వచ్చి.. అలా వెళ్లారు..!

- ముచ్చుమర్రిలో నిశ్శబ్దం

పగిడ్యాల: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం చేపట్టిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ సందర్శన సాదాసీదాగా సాగింది. నందికొట్కూరులో రోడ్‌షోను ముగించుకుని ప్రత్యేక కాన్వాయ్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ఆయన ముచ్చుమర్రికి చేరుకున్నారు. అయితే చంద్రబాబుకు జనసంచారం లేని నిర్మానుష్యమైన దారులు మాత్రమే స్వాగతం పలికాయి. సుమారు కిలోమీటరు దూరం ఊరిలో ఓపెన్ టాపు వాహనంలో చంద్రబాబు కనిపించినా స్థానికులు ఎవరూ ఆయనను పట్టించుకోకపోవడం గమనార్హం. స్థానిక నాయకత్వ లోపం కొట్టొచ్చినట్లు కనిపించడంతో బాబు ప్రాజెక్టు సందర్శన కేవలం 25 నిముషాల్లోనే ముగిసింది. ఇలా వచ్చి, అలా వెళ్లడం చూసి ఈయనేనా మాజీ ముఖ్యమంత్రి అనే చర్చ కొనసాగింది.



ముచ్చుమర్రిలో నిర్మానుష్యమైన దారిలో సాగుతున్న మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు కాన్వాయ్

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలో నలుగురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ కంఠం భూముల సర్వే, నివేదికలను పంపించడంలో సంబంధిత కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారన్నారు. సస్పెండ్ అయిన వారిలో కోసిగి మండలం మూగలదొడ్డి, పల్లెపాడు పంచాయతీ కార్యదర్శులు ఎస్.పరుశురాం, జి.వినోద్ కుమార్, ఎమ్మిగనూరు మండలం బనవాసి కార్యదర్శి బి.సోమప్ప, కొతాళం మండలం లింగాలదిన్నె కార్యదర్శి కె.శ్రీరాములు ఉన్నారన్నారు.